విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: పేదల ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేసి నిర్ణీత సమయంలో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కుప్పన పూడి జగనన్న లే అవుట్ ను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అకస్మిక తనిఖీలు చేసి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 2791 ఇళ్లకు 210 మాత్రమే పూర్తి చేయడం పట్ల జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. లే అవుట్ అంతా జిల్లా కలెక్టరు తిరిగి పరిశీలించారు. రెండుపూటల మంచి నీరు వచ్చేలా చూడాలని నగర పంచాయతీ కమిషనరు ను జిల్లా కలెక్టరు ఆదేశించారు. లే అవుట్ పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. రహదారి నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసి నివేదిక అందజేయాలన్నారు. గ్రామాలు, అర్బన్ లే అవుట్లలో మౌలిక వసతులు సదుపాయాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాల్లో ప్రతిరోజు స్టేజ్ కన్వర్షన్ జరగాలని బిబిఎల్ నుండి బి ఎల్ కు, బి ఎల్ నుండి ఆర్‌ఎల్‌కు, ఆర్ ఎల్ నుండి ఆర్‌సిలకు ప్రతిరోజు స్టేజ్ కన్వర్షన్ జరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టరు వెంట గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు అల్లూరి వెంకట రామ రాజు, ఇఇ బి. వెంకట రమణ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమవతి, తహశీల్దారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దామోదర్‌పై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

విశాలాంధ్ర -భీమవరం: కర్నూలు జిల్లా డోన్ బార్ అసోసియేషన్ కోశాధికారి న్యాయవాది పులి దామోదర్ పై దాడి చేసి హత్య ప్రయత్నం చేయడానికి ప్రయత్నించిన దుండగులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఐఏఎల్ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. దామోదర్ పై జరిగిన దాడిని నిరసిస్తూ ఐఏఎల్ అధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దామోదర్ పై గతంలో కూడా ఈ విధంగా దాడి జరగటం ఈసారి హత్య ప్రయత్నం చేయడం దుండగులపై కఠిన చర్యలు తీసుకోపోవటమే కారణమని వారిని వెంటనే అరెస్ట్ చేసి ఐపిసి సెక్షన్ 307 నమోదు చేసి ఇలాంటి చర్యలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే న్యాయవాద రక్షణ చట్టాన్ని అమలు చేసే విధంగా పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఐఏఎల్ నాయకులు నెక్కంటి క్రాంతి కుమార్, మోకా రాముడు, వై.వి.ఆనంద్, పాలా రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ సరఫరా చేయాలి : జేసీ మురళి

విశాలాంధ్ర - ఉండి : వినియోగదారులకు నాణ్యమైన , ఖచ్చితమైన తూకంతో పెట్రోల్ , డీజిల్ ను అందించాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి అన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ పౌరసరఫరాలు, తూనికలు కొలతల అధికారులతో కలిసి స్థానిక ఎన్ ఆర్ పి అగ్రహారం గ్రామంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐ ఓ సి ఎల్ పెట్రోల్ బంకులు నూతనంగా ప్రవేశపెట్టిన యాప్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు మోసాలకు లోను కాకుండా ఉండాలన్న సదుద్దేశ్యంతో క్రొత్తగా పెట్రోల్ బంక్స్ ఇన్స్పెక్షన్ యాప్ ని తయారు చేయడం జరిగిందన్నారు. తనిఖీలో భాగంగా ఆ పెట్రోల్ బంక్ లో పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు, తూకం, రేటు, భద్రతా ప్రమాణాలు, వినియోగదారులకు అందించవలసిన ఉచిత సౌకర్యాలు అయిన గాలి పంపు, మంచి నీరు, టాయిలెట్స్ తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలో జిల్లా సివిల్ సప్లై అధికారి యన్. సరోజ ,లీగల్ మెట్రాలజి సాయి సంచాలకులు నాగరాజారావు, ఏయస్‌వో యం.రవి శంకర్, సేల్స్ ఆఫీసరు జె. వాసు, తది తరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రమాణా నిరోధం, నిర్బంధ వెట్టిచాకిరి నిర్మూలనపై వర్క్ షాపు

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ భవనంలో మానవ అక్రమ రమాణా నిరోధం, నిర్బంధ వెట్టిచాకిరి నిర్మూలనపై వర్క్‌షాపు నిర్వ హించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ వర్క్ షాప్ లో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, సూర్య చక్రవేణి, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఎన్జీవోస్, పోలీస్ , వన్ స్టాప్ సెంటర్ , కార్మిక శాఖ, అధికారులు, సిబ్బంది తోపాటు ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ అక్రమ రవాణా సర్వసాధారణంగా మారిందని ఇందులో బడుగు, బలహీన వర్గాల వారు బలవుతున్నారన్నారు. ఈ దృష్ట్యా ఈ అంశాన్ని పూర్తిగా నిరోధించేందుకు దీనిపైన అవగాహన కలిగించడం కోసం ఈ వర్క్ షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. ఇటువంటి దుశ్చర్యలు పాల్పడే వారిని తెలుసుకొని వారిపై చర్యలు తీసుకొనేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కమిటీ జిల్లా వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా, నిర్బంధ వ్యక్తి చాకిరీ నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేశారు.

ముగిసిన న్యూమరికల్ మెథడ్స్ కార్యశాల

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణ పురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో న్యూమరికల్ మెథడ్స్ అంశంపై గత మూడు రోజులపాటు సాగిన కార్యశాల బుధవారం ముగి సింది. ముగింపు సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కే. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ అభిరుచి, ఆసక్తి పెంపొం దించు కుని గణిత శాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన టి .శివకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో గల అంకితభావం, మరిన్ని క్రొత్త విషయాలను బోధించాలని ఆలోచన కలిగించిందని, భవిష్యత్తులో గణిత శాస్త్రంలో నైపుణ్యం సంపాదించడానికి కావలసినటువంటి మెలకువలను విద్యార్థులకు తెలియజేయడం ఎంతో సంతోషకర మన్నారు. గణిత విభాగ అధ్యాపకులు డాక్టర్ పి.బాబురావు మాట్లాడుతూ గణిత శాస్త్రంలో సాధన చేయడం ద్వారా మేధోసంపత్తి పెంపొందించుకోవడమే కాకుండా శాస్త్ర పరిజ్ఞానం పెంపొందించే అవకాశం అధికంగా కలుగుతుందదన్నారు. ఐక్యు ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకోవాలని పట్టుదలుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సి పాల్ అధ్యాపకులు, విద్యార్థులు ముఖ్యఅతిథిగా విచ్చేసిన టి. శివ కృష్ణను సన్మానించి అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: గ్రామ పంచాయతీ లలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటియుసి ఏలూరు జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి బాబు డిమాండ్ చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు (గ్రీన్ అంబాసిటర్స్ యూనియన్) ఏఐటియుసి ఆధ్వ ర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆందోళన నిర్వహించి ఎంపీడీవో ఎన్‌టి స్వామి కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాబు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మి కులు గత మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ప్రతి కార్మికుడికి 15 వ ఆర్థిక సంఘం నిధుల నుండి జీఓ నెంబర్ 680 ప్రకారం నెలకు పది వేల రూపాయలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎరియర్స్ తో కలిపి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, పంచాయతీలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని,ప్రతి సంవత్సరం మార్చి నెల ఆఖరులో ఆర్డర్లు మంజూరు చేయడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండలకార్యదర్శి సాకా గంగరాజు, ఏఐటియుసి జిల్లా కన్వీనింగ్ కమిటీ మెంబరు కంకిపాటి బుచ్చిబాబు,పారిశుద్ధ్య కార్మికులు వై. వెంకటేశ్వరరావు, వై. రామకృష్ణ,ఎ. శ్రీను, సురేష్,విస్సంపల్లి పిచ్చియ్య,మానుకొండ మోహన్ రావు, సి హెచ్ పౌలు,జె. గంగరాజు,అబ్బ దాసరి వెంకటేశ్వరరావు,కె. మహా లక్ష్మడు తదితరులు పాల్గొన్నారు.

10న నిరసనలు జయప్రదం చేయండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - ఏలూరు : సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల వద్ద జరిగే నిరసనలు జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈనెల 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురి చేసిందని, వ్యవసాయ రంగానికి నిధులు కోత పెట్టిందని విమర్శించారు. రైతులు, రైతు సంఘాలు కోరే విధంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించి, చట్టబద్ధత కల్పించే విషయమై ఈ బడ్జెట్లో ప్రస్తావించకపోవడం అన్యాయం అన్నారు. కార్పొరేట్ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం బాటలు వేస్తుందని ఆరోపించారు. రైతుల సంక్షేమానికి బడ్జెట్లో ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితులకు నష్టపరిహారం, ప్యాకేజీ తదితర అంశాలపై నిధులు కేటాయించక పోగా కనీసం ప్రస్తావన లేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి, వ్యవసాయ కూలీలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు నిధులు కేటాయింపులు లేవని, రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణాలకు నిధులు ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రస్తావనే లేదని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ వ్యతిరేకంగా ఈనెల 10న జరిగే నిరసన కార్యక్రమాలను ఏలూరు జిల్లాలో సిపిఐ శ్రేణులు, మండల, పట్టణ, ఏరియా నాయకత్వాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పొగాకు సాగు లక్ష్యానికి మించి పెరగనున్న విస్తీర్ణం

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: ఈ ఏడాది పొగాకు సాగు ఆశాజనకంగా ఉంటుందని నమ్మకంతో ఎక్కువ విస్తీర్ణంతో రైతులు పండిస్తున్నారని రాజమండ్రి సిటిఆర్ఐ డైరెక్టర్ ఎం. శేషు మాధవ్ అన్నారు. బుధవారం జీలుగుమిల్లిలో సిటిఆర్ఐ కేంద్రంలో కిసాన్ మేళా, పొగాకు సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతుల పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతికూల వాతావరణం ఏర్పడినా పొగాకు సాగు విస్తీర్ణం,దిగుబడి ఈ ఏడాది లక్ష్యానికి మించి పెరిగే అవకాశం ఉందని పొగాకు బోర్డు భావిస్తోంది. కర్ణాటకలో పొగాకు సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టటం, ఆ మేరకు ఉత్పత్తి కూడా తగ్గటంతో ఈ ఏడాది మార్కెట్ ఆశాజనకంగా ఉంటుందన్న ప్రగాఢమైన నమ్మకంతో పొగాకు సాగు విస్తీర్ణాన్ని పెంపుదల చేస్తున్నారన్నారు. ఈ సంవత్సరానికి పొగాకు బోర్డు 142 మిలియన్ కిలోల ఉత్పత్తి లక్ష్యాన్ని ప్రకటించగా 150 మిలియన్ కిలోలు దిగుబడి రావచ్చని అంచనా అన్నారు. మాండూస్ తుపాను వల్ల సుమారు 30 వేల హెక్టార్లలో కొన్ని చోట్ల పాక్షికంగా, మరికొన్ని చోట్ల పూర్తిగా పంట దెబ్బతినగా రైతులు మళ్ళీ ఆ పొలాల్లో సాగుకు ఉపక్రమించారు. అనంతరం అర్హులైన ఎస్ సి, ఎస్ టి పొగాకు రైతులకు క్యూరోమీటర్లు కూలీలకు వ్యవసాయ పరికరాలు అయినా రెండు పారాలు ఒక కొడవలి ఉచితంగా పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జయకృష్ణ, సుబ్బయ్య ,రమేష్ పొగాకు బోర్డు, వ్యవసాయ కళాశాల అధికారులు,రైతులు,రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

పన్ను ఎగవేత దారులపై కఠిన చర్యలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: పన్ను ఎగవేత దారులపై కఠినంగా వ్యవహరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కమిషనర్ భవాని ప్రసాద్ లు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలో పన్ను ఎగవేత దారుల జాబితాను వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి కమిషనర్ భవాని ప్రసాద్ లు మాట్లాడుతూ పన్ను బకాయిదారులందరికీ నోటీసులు జారీ చేశామని తెలిపారు.రూ.50 వేలకు పై బడిన మొండి బకాయి దారుల జాబితాను ప్రకటించారు. ఇతరులు మొత్తం రూ.9కోట్లు మున్సిపాలిటీ కి బకాయి వున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలతో సమస్యలెన్నో!

- అధికారికంగా పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేని పరిస్థితులంటూ రైతుల ఆవేదన

విశాలాంధ్ర - లింగపాలెం : మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో చెరువు గర్భాల ఆక్రమణలు వివాదాస్పదంగా ఉండి వీటి వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయి. వీటి ఆక్రమణలలో అధికంగా వరి పండిస్తున్నారు. ఇప్పుడు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటే భూమి ఉన్న రైతులంతా ఇ-క్రాఫ్ నమోదు చేసుకోవాలి. మండలంలో ఇ-క్రాఫ్ నమోదు 7 వేల 600 ఎకరాలకు చేశారు. ఇ-క్రాఫ్ నమోదు చేసుకున్న రైతులు ఎకరాకి 37 బస్తాలను ప్రభుత్వానికి విక్రయించేందుకు అనుమతులు ఇచ్చారు. ఇ-క్రాఫ్ నమోదైన భూముల నుంచి వరి దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేసింది. మండలంలో 11 వేల 700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. మండలంలో వరి పండించిన విస్తీర్ణంలో వచ్చిన దిగుబడులను పరిశీలిస్తే వీటి కొనుగోళ్ళు సజావుగానే దాదాపుగా జరిగింది. అయితే చెరువు గర్భాలలో వేసిన పంటను ఇ-క్రాఫ్ చేయటానికి వీలుపడదు. మండలంలో దాదాపు 800 ఎకరాల చెరువు గర్భాల భూములను ఆక్రమించుకున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ భూములలో దాదాపు పది వేల క్వింటాళ్ళ ధాన్యాన్ని ఈ ఏడాది పండించారు. ఇ-క్రాఫ్ నమోదు చేయకుండా వీటిని విక్రయింటానికి వీలుపడదు. ఇ-క్రాఫ్ చేసుకున్న రైతుల పేర్లతో వీటిని విక్రయించాలి. మండలంలో మరో 800 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి. వీటిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఆక్రమణల భూముల్లో వేసిన వరి పంట వల్ల ఈ పరిస్థితి నెలకొన్నట్టు అధికారులు అంటున్నారు. ఆక్రమణల్లో పండించిన ధాన్యాన్ని ఆక్రమణదారులు ఇ-క్రాఫ్ నమోదు చేసుకున్న రైతుల పేరుతో విక్రయించేవారు. ఇప్పుడు మిగిలిన ధాన్యం ఇ-క్రాఫ్ నమోదు చేసుకున్న వారివే. వీటిని కొనుగోళు ¸ చేయాలని రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఆక్రమణదారులు ధాన్యాన్ని అమ్మేసుకుంటే తమ భూముల్లో అధికారికంగా పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేని పరిస్థితి తలెత్తిందని వీరు వాపోతున్నారు. చెరువుల ఆక్రమణలను తొలగించకపోవటం వల్ల ఇటువంటి పరిస్థితులు తలెత్తాయని రైతులు అంటున్నారు. చెరువుల ఆక్రమణలు తొలగిస్తే అన్ని విధాలుగా ప్రయోజనం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

ముఖ హాజరు రద్దు చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో కార్పొరేషన్, మున్సిపాలిటీ ల లో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బందికి ప్రవేశపెట్టిన ముఖ హాజరును తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వర రావు డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరులో భోజన విరామ సమయంలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీ యుసి)ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాను ఉద్దేశించి ఏఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ. అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ముఖ హాజరు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి నెలకు రూ.26 వేలు వేతన ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్స్ కు నెలకు రూ.18 ఏళ్ల 500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని. ఎన్ ఎం ఆర్ లను రెగ్యులర్ చేయాలని ఉద్యోగ సిబ్బందికి, పెన్షనర్లకు ప్రతినెల మొదటి తేదీనే జీతాలు పెన్షన్లు చెల్లించాలన్నారు. బకాయి పడ్డ సరెండర్ లీవులు, డిఏ లు తక్షణమే చెల్లించాలని కోరారు. ఇంజనీరింగ్, కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్, సిబ్బందికి బకాయి ఉన్న వేతనాలు ఎరియర్స్ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు పోలా భాస్కర్, గేదెల నాగేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్ఎంవి సుబ్బారావు, ఎం. దుర్గారావు, బి. నాగేశ్వరరావు, టి. రామారావు, ఎస్ కే ఆలీ, టి. శ్రీను, ఎస్‌కె.అక్బర్, సిహెచ్ శ్రీను, బాషా, బిపి రాజు, కె. రాము తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. వసంతరావు

విశాలాంధ్ర - చింతలపూడి : ధాన్యం బకాయిలు తక్షణం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మామిళ్ళపల్లి వసంతరావు డిమాండ్ చేశారు. బుధవారం సమ్మెట వారి గూడెంలో రైతుల సమావేశం రావెళ్ళ హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వసంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజులకే డబ్బులు చెల్లిస్తామని చెప్పి నేటికి 40 రోజులైనా డబ్బులు విడుదల చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణం ధాన్యం డబ్బులు విడుదల చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ కె.కాలేషా దొంతా కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కౌలు రైతుల అనేక సమస్యలతో సతమతమవుతుంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కౌలు రైతుల ఊసే లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోసం మార్చి 13వ తేదీన రైతుల రాష్ట్ర సదస్సు విజయవాడలో జరుగుతుందని దీనిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ రాయకుల లక్ష్మణరావు మాట్లాడుతూ కౌలు రైతులకు అనేక నిబంధనలు పెట్టి వారికి రావలసిన రైతు భరోసా రాకుండా చేయడం కౌలు రైతు ధాన్యం అమ్మాలంటే అనేక ఇబ్బందులు పడ్డారని ఎటువంటి నిబంధన లేకుండా కౌలు రైతులకు రైతు భరోసా ధాన్యం అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలన్నారు.

దళిత డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - పాలకొల్లు: డప్పు కళాకారుడు డప్పు కొట్టకపోతే దేవుడికి కూడా మనుగడ లేదని ఆంధ్రప్రదేశ్ దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పాలకొల్లు అంబేద్కర్ భవన్లో నిర్వహించిన దళిత డప్పు కళాకారుల సంఘం జిల్లా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దళిత డప్పు కళాకారులు తీన్మార్ వాయిస్తే ప్రభుత్వం దిగి రావాలని సమైక్యంగా ఉద్యమాలు చేద్దామంటూ పిలుపునిచ్చారు. శవాలను కూడా ఆడించగల సామర్థ్యం, దేవుడిని కూడా మేల్కొల్పగల సత్తా డప్పుకి ఉందన్నారు. దళిత డప్పు కళాకారులను ప్రభుత్వం, సమాజం కూడా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు దళితులు నా మేనమామలు అన్న జగన్ డప్పు కళాకారులకు పెన్షన్ ఇచ్చేందుకు రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ప్రతి దళిత డప్పు కళాకారుడికి రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ప్రభుత్వం దళిత డప్పు కళాకారులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఎం. లాల్ సన్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం. సీతారాం ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్ సుందర్, జిల్లా కార్యదర్శి దిద్దే నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు శెట్టిమి నాగేశ్వరరావు, జె. వెంకట్రావు, కవి కోలాటి పెద్దిరాజు, పెద్ద సంఖ్యలో దళిత డప్పు కళాకారులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలి

విశాలాంధ్ర-ముసునూరు: రబీ పంటకాల సీజన్‌లో పలు పంటలు సాగుచేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ట్రైనీ కలెక్టర్ అపూర్వ భర్త్ పేర్కొన్నారు.బుధవారం మండలంలోని చక్కపల్లి గ్రామంలో ఈ క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు .చెక్కపల్లి గ్రామంలో అరటి,మొక్కజొన్న ,మిరప,పుగాకు బొప్పాయి ఇలా పంటల సాగు వివరాలను తహశీల్దార్ దాసరి సుధ , విఆర్ఓ పయ్యాస్ లతో మాట్లాడారు. ప్రతి రైతు పండించే పంటను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం అమలు చేయాలి

విశాలాంధ్ర-ముసునూరు: అంగన్‌వాడి కేంద్రంలో మధ్యాహ్నభోజనం పథకం ప్రభుత్వం మోనూ ప్రకారం అమలు చేయాలని ముసునూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. రాణి అన్నారు. బుధవారం మండలంలోని వలసపల్లి గ్రామంలో అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఆనంతరం వలసపల్లి గ్రామ సచివాలయాన్ని పరిశీలించి,వాలంటీర్లతో పాటు సచివాలయం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ పథకాలు (నవరత్నాలు) అమలు చేయడంలో అలసత్వం వహించరాదన్నారు.

రూ .146.81 లక్షలతో అభివృద్ధి పనులు

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో రూ.146.81 లక్షలతో 44 పనులలో లట్కీపేట, ఎంఆర్‌సి కాలనీ,పంపులు సెంటర్, తోటకూర దొడ్డులు, యాదవ నగర్, రజకుల పేట ,కొత్తపేట, చోడిమిల్లి, పోస్టల్ కాలనీలో పూర్తిచేసిన సిసి రోడ్లు, డ్రైనులను, ఎంపీ నిధులు రూ.91.50 లక్షలు వ్యయంతో నగరం లోని 17,43,25,4,24 డివిజన్లు లో 5 వివిధ అభివృద్ధి పనుల్లో పూర్తి అయిన మల్టీపర్పస్ భవనాలు, గాంధీ జ్ఞాన మందిర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సీసీ రోడ్లు అక్కడక్కడ ఫినిషింగ్ సరిగా లేదని వాటిని సరుచేయాలని, రోడ్లపై వున్న వాటర్ పైపులు తొలగించి నీరు వృధా కాకుండ చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. డ్రైనేజీలో చెత్త తొలగింపు సరిగా లేదని సరిచేసి క్లీనింగ్ చేసిన అనంతరం ఫోటోలు తీసి సమర్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. వార్డు సచివాలయంలో ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్లు పర్యవేక్షణ లేదని, వారికి షోకాజ్ నోటీస్ ఇవ్వమని కమిషనర్‌ను ఆదేశించారు. గతంలో పారిశుధ్య మెరుగుకు ఏర్పాటు చేసిన టీమ్ పారిశుద్ధ్య మెరుగు చేయడంలో విజిబుల్ శానిటేషన్ కనబడుటలేదని కలెక్టర్ అసంతృప్తి వెలిబుచ్చారు. అనంతరం మేదర వీధిలోని 43 వ వార్డు సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో స్పందన అర్జీలు, నవరత్నాలు జగనన్న కాలనీ గ్రౌండ్, సిబ్బందిహాజరు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటన గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కార్పొరేషన్ ఎంఈ భాస్కరరావు, ఎంహెచ్‌ఓఆర్ మాలతి, పబ్లిక్ హెల్త్ డిఈ ఫణిభూషణ్, మున్సిపల్ ఏఈ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితుల ఆచూకీ తెలిపితే బహుమతి

విశాలాంధ్ర-ముసునూరు: కాట్రేనిపాడు జంట హత్య కేసులోని నిందితుల ఆచూకీ తెలిపిన వారికి ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నట్లు నూజివీడు సిఐ అంకబాబు పేర్కొన్నారు. మంగళవారం మండల పోలీస్ స్టేషన్‌లో సిఐ అంకబాబు విలేకర్లతో మాట్లాడుతూ ముసునూరు మండలం కాట్రేనిపాడులో జరిగిన జంటహత్య కేసులోని నిందితుల కోసం నూజివీడు డివిజన్‌లో నూజివీడు రూరల్, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల ఎస్ఐలను ఐదు బృందాలుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబసభ్యులను సుమారు 20 మందికి పైగా వున్న వ్యక్తులను ఆధునిక టెక్నాలజీతో (ఫోన్ సమాచారం, సీసీ ఫుటేజీ) కూడిన అన్ని విధాలుగా ఆ ఇరువురిని పట్టుకునే విధం గా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

విదేశీ విద్యా పథకం నిబంధనలు సడలించాలి

విశాలాంధ్ర-ఏలూరు: ముఖ్యమంత్రి జగన్ జగనన్న విదేశీ విద్యా కానుక పథక నిబంధనలు సడలించాలని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాల బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్ అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నానని ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసి అభివృద్ధిని అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, కాపు వర్గాలలోని పేద విద్యార్థులకు భరోసా కల్పించేలా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్యూఎస్200 యూనివర్సిటీ నిబంధనలను సడలించి విదేశీ విద్య పథకాన్ని అందరికీ అందేలా అవకాశాలు కల్పించాలని కోరారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 4,923 మంది విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి రూ.10 లక్షలు చొప్పున రూ.364.9 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఈ పథకాన్ని నిలిపివేసిందని ఆరోపించారు. ప్రస్తుతం కేవలం 213 మందికి కేవలం రూ.19 కోట్లు చెల్లించి గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇకనైనా నిబంధనలు సడలించి పేద విద్యార్థులకు అండగా ఉండి అవకాశాలు కల్పించాల్సిందిగా కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

విశాలాంధ్ర - పాలకొల్లు:పార్టీ బలోపేతానికి, గెలుపుకు ప్రతి ఒక్కరు సమైక్యంగా కృషి చేయా లని జడ్పీ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. బుధవారం పాలకొల్లు మండలం లంకల కోడేరు గ్రామ సచివాలయంలో వెలివెల, చింతపర్రు, వడ్లవాని పాలెం, కాపవరం, వాలమర్రు, అరట్లకట్ట, గవరపేట, వెంకటాపురం, లంకలకొడేరు గ్రామాలకు సంబందించిన గ్రామ సచివాలయ కన్వీనర్లకు, వాలంటిర్లకు, గృహ సారధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ కన్వీనర్ లు, గృహసారథులు, వలంటీర్లు అందరూ కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్ ప్రకాష్, గుణ్ణం నాగబాబు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మీ, ఏడుకొండలు, జెడ్పీటీసీ నడపన గోవింద రాజులు నాయుడు, మండల కన్వీనర్ మైఖేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: దాళ్వా సాగుకు నీటి అడ్డంకులు లేకుండా మురుకు కాలువలపై అడ్డుకట్టలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగార్జునసాగర్ తెలిపారు. బుధవారం విశాలాంధ్ర ప్రతినిధితో మాట్లాడుతూ జిల్లాలో వివిధ డ్రైన్లపై 138 అడ్డుకట్టల్ని నిర్మించేందుకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందన్నారు. వీటిని వేగ వంతంగా వేసేందుకు టెండర్లు పిలుస్తున్నామని పూర్తయిన వెంటనే గుత్తే దారులకు పనులను అప్పగించి పూర్తయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు.

మహాధర్నాలో ముద్దాడ గణేష్ భవాని

విశాలాంధ్ర - పాలకొల్లు: చట్ట సభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనగణనలో కుల గణన చెయ్యాలని, కేంద్రంలో బీసీ లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలనే న్యాయమైన డిమాండ్లతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బుధవారం నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య తో పాలకొల్లు కు చెందిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని యాదవ్ కలసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గ నరేష్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు పిల్లా శ్రీనివాస్ దంపతులు, ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ పి. దినేష్, రాష్ట్ర మహిళ కన్వీనర్ బి.హేమ, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ మేండే జ్యోతి, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్, ఏలూరు జిల్లా అధ్యక్షులు భీమవరపు సురేష్, రాష్ట్ర నలుమూలల నుండి వందలాది మంది బిసి సోదరులు పాల్గొన్నారు.

టీడీపీ ధర్నా

విశాలాంధ్ర-ఉంగుటూరు: పేద విద్యార్థులకు విదేశీ విద్య అన్యాయంగా దూరం చేశారని బుధవారం ఉంగుటూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమణారావుకు ఏలూరు జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు యాళ్ల సుజీవరావు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంటా యువరాజు, లీగల్ సెల్ అడ్వకేట్ ఇర్లపాటి మోషే, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర -ముసునూరు: మధ్యాహ్న భోజనం కార్మికుల బిల్లులు చెల్లించలేదంటూ ముసునూరు మండల మధ్యాహ్న భోజనం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. 2019 వ సంవత్సరం నుండి అధికారంలోకి వచ్చిన ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గోరుముద్ద పేరుతో మధ్యాహ్నభోజనంలో మోనూ మార్చడమే తప్ప,వారి బిల్లులు మాత్రం ఇవ్వడంలేదని సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లిపాము భవాని,దొంతు కోటయ్య, బాలమ్మ, దాడిచర్ల నాగరత్నం, తిరుపతయ్య, సయ్యద్ ముంతాజ్‌బేగం, సత్యవతి ,చెంగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దాసాంజనేయ స్వామికి 18న విశేష అభిషేకాలు

విశాలాంధ్ర - పాలకొల్లు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని పాలకొల్లు కెనాల్ రోడ్ లో వేంచేసి ఉన్న రుద్రాక్ష సంభూత శ్రీ దాసాంజనేయ స్వామి వారికి, ఈ నెల 18వ తేదీ, స్థిర వారం ఉదయం గం. 10:50గంటల నుండి 12:30 వరకు భక్తుల గోత్రనామాలతో మూలమూర్తికి ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహించే ఏకాదశ మన్యుసూక్త నమకం, చమకం, నవగ్రహ మంత్రాలతో వేద మంత్రాలతో, 18 రకముల ద్రవ్యములతో, సప్త వర్ణములతో కనుల పండుగగా ఏకా దశ హారతులతో స్వామివారికి విశేష అభిషేకములు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీ చైతన్యలో సి బ్యాచ్ అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక బాలాజీ నగర్ శ్రీ చైతన్య పాఠశాలలో సి బ్యాచ్ అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీ చైతన్య పాఠశాల జోనల్ కోఆర్డినేటర్ ఉదయభాస్కర్ సి బ్యాచ్ పట్ల అవగాహన కల్పించారు. నేటి పోటీ కాలంలో పాఠశాల స్థాయిలో నూతన విద్య, విద్యా విలువలు మెరుగుపరుచుకునేందుకు రాజమండ్రి, విజయవాడ లాంటి ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా మన పరిసర ప్రాంతంలోని శ్రీ చైతన్య ఆధ్వర్యంలో సి బ్యాచ్ ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటి, నెట్ స్థాయిలో విద్యలను అందించేందుకు సి బ్యాచ్ పాఠశాల స్థాయి నుండి ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. మెరుగైన విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులకు వారి సందేహాలను సైతం నివృత్తి చేశారు.

రఘురాంను పరామర్శించిన ఎమ్మెల్యే గ్రంధి

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ముఖ్యమంత్రి జగన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎం ఎల్ సి తలశిల రఘురాంను భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ బుధవారం విజయవాడలో గొల్లపూడి లోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రఘురాం సతీమణి స్వర్ణ కుమారి అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. కాగా ముందుగా స్వర్ణ కుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దళితులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

విశాలాంధ్ర-తణుకు: దళితులను ముఖ్యమంత్రి జగన్ మోసం చేస్తున్నారని టిడిపి ఎస్‌సి సెల్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చుక్కా సాయిబాబు విమర్శించారు. విదేశీ విద్య పథకంలో ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, మైనార్టీ ,కాపు వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని నిరసిస్తూ టిడిపి నియోజకవర్గ నాయకులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేసి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.అనంతరం తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు సాదే సామ్యూల్ రాజు, అబ్బు దాసరి లాజర్ నియోజవర్గ సెక్రటరీ కారెం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ఐకమత్యంగా ఉందాం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గం పద్మశాలి, దేవాంగ, కర్ణ భక్తుల రాజకీయ చైతన్యం చేసేందుకు పార్టీలకు అతీతంగా రౌండ్ టేబుల్ సభ ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉంగుటూరులో ఆ సంఘం ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు దొంతంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలో 6500 మంది పైనే చేనేత కులస్తులు ఉన్నారని, చేనేత ఐక్యత కోసం కలిసికట్టుగా పార్టీలకు అతీతంగా మనమందరం ఐక్యమత్యంతో ఉండాలన్నారు. అందరిని ఏకం చేసేందుకు చేనేత సభ నిమిత్తం త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు వానపల్లి నాగరాజు మాట్లాడుతూ చేనేత కార్మికులందరూ ఐక్యమత్యంగా ఉంటేనే మనం అన్ని విధాల అభివృద్ధి చెందుతామన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకుడు, ఎంపీటీసీ సభ్యులు బందారు నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

భారీ ఎత్తున అన్న సమారాధన

విశాలాంధ్ర-ఉంగుటూరు: పెద్దింట్లమ్మ ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఉంగుటూరు మండలం చేబ్రోలు నూతల చెరువు వద్ద ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారికి చేబ్రోలు గ్రామ సర్పంచి లక్ష్మీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నారాయణపురం ఎంపీటీసీ సభ్యుడు బందారు నాగరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ ఇంచార్జ్ పత్స మట్ల ధర్మరాజు , ప్రజా ప్రతినిధులు కార్యదర్శుల పెద్దింటమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం

విశాలాంధ్ర-టీ నరసాపురం: ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పేద విద్యార్థులకు విదేశీ విద్యను దూరం చేస్తున్నారని టిడిపి బిసి సెల్ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండపల్లిరవి ఆరోపించారు. పార్టీ అదేశాల మేరకు పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం చేయడాన్ని నిరసిస్తూ మండల తెలుగుదేశం పార్టీ, బిసి సెల్ అధ్వర్యంలో టి నరసాపురం ప్రధాన సెంటర్ లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ఉదయ్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంపన్న వర్గాలతో సమానంగా బడుగుబలహీన వర్గాలకు 4923 మందికి 364 కోట్ల రూపాయలతో విదేశీ విద్యను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి , పాపాచార్యుల వీరేశలింగం, సిద్దా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ జేవీ మురళి

విశాలాంధ్ర-పాలకోడేరు: రీసర్వే పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి అన్నారు.బుధవారం పాలకోడేరు రీ సర్వే పనులను జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ భీమవరం డివిజన్ లో 28 గ్రామాలు రీ సర్వే అయ్యాయని, మిగిలిన 100 గ్రామాలు ఫిబ్రవరి నెల ఆఖరున పూర్తి చేయాలని సర్వే అధికారులను జిల్లా జాయింటు కలెక్టరు ఆదేశించారు. రీ సర్వే లో భాగంగా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు, చెక్ పాయింట్లను కచ్చితంగా గుర్తించి పనులు వేగవంతం చేయాల న్నారు. నరసాపురం డివిజన్లో గల గ్రామాలను ఈ సర్వేలో భాగంగా డ్రోన్ ఫ్లే కార్యకలాపాలు చేయుటకు పైలెట్ ఏజెన్సీ ఏ ఈ ఐ కు కేటాయించామని డ్రోన్ ఫ్లే చేయుటకు అధికారులు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ సర్వేలో భాగంగా ప్రతి అంగుళం ప్రభుత్వ భూమిని గుర్తించి రికార్డు చేయడం జరుగుతుందని ప్రతి రైతు జరాయితీ భూమిని పక్కాగా సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా జాయింటు కలెక్టరు వెంట జిల్లా సర్వే అధికారి కె. జాషువా, డిప్యూటీ సర్వే అధికారి యస్. రాంబాబు, డి టి సూర్యనారాయణ, సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్ పైలెట్ వరప్రసాద్ రెడ్డి, కో.పైలెట్ దుర్గాప్రసాద్,సచివాలయ సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

11న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పర్యటన

విశాలాంధ్ర- భీమవరం : భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ఈనెల 11వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనుటకు భీమవరం రానున్నారు. ఈనెల 11వ తేదీన ఉదయం గం.5.40లకు విజయవాడ రైల్వే స్టేషన్ నుండి నాగర్ సోల్ ఎక్స్ ప్రెస్ ట్రైన్‌లో బయలుదేరి ఉదయం గం.7. 19 లకు భీమవరం రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. అక్కడ నుండి విష్ణు కళాశాలలోని గెస్ట్ హౌస్ కు చేరుకుంటారు. ఉదయం గం.9.00లకు విష్ణు కళాశాల గెస్ట్ హౌస్ నుండి బయలుదేరి రాయలం , శివరావుపేట లో గల అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్దకు చేరుకొని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేస్తారు. అనంతరం 9. 50 నిమిషాలకు అక్కడనుండి బయలుదేరి 10 గంటలకు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీర్ కళాశాలకు చేరుకుంటారు. 10 గంటల నుండి 12 గంటల వరకు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ లో నిర్వహించే ఫంక్షన్ కు హాజరవుతారు. మధ్యాహ్నం 12.00 గంటల కు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి బయలుదేరి 12.10 గంటలకు విష్ణు కళాశాలలోని గెస్ట్ హౌస్ కి చేరుకుంటారు .అక్కడ విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 3. 30 నిమిషాలను విష్ణు కళాశాల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 4.50 విష్ణు కళాశాల గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి 5.00 గంటలకు భీమవరం రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. సాయంత్రం 5.15 నిమిషాలకు ట్రైన్ లో బయలుదేరి 7.30 నిమిషాల కు స్వర్ణ భారతి ట్రస్ట్ ఆత్కూరు చేరుకుంటారు.

జగనన్న విదేశీ విద్యా పథకంలో మోసం

విశాలాంధ్ర -భీమవరం: పేద విద్యార్థులకు విదేశీ విద్యా పథకం అందకుండా వైకాపా ప్రభుత్వం మోసం చేసిం దని పట్టుమని రెండొందల మంది విద్యార్థులకు కూడా ఈ పథకం వర్తించక పోవడం శోచనీయమని టిడిపి విమర్శించింది. జగనన్న విదేశీ విద్య పథంకంలోని లొసుగులను నిరసిస్తూ బుధవారం టిడిపి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు పేద విద్యార్థులు 4,923 మందికి విదేశీ విద్యా పథకం ద్వారా ఒక్కొక్క విద్యార్థికి రూ 10 లక్షల చొప్పున రు 364.98 కోట్లు మొత్తం చెల్లించడం జరిగిందని ప్రస్తుత జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాలుగా ఆపథకాన్ని పక్కనపెట్టి ప్రస్తుతం 213 మంది విద్యార్థులకు రూ19 కోట్లు చెల్లించి గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. కొద్దిమంది విద్యార్థులకు మాత్రమే విదేశీవిద్యా పథకాన్ని వర్తింపజేసి ఇచ్చిన రూపాయల కంటే 50 కోట్లు ప్రకటనలు ఇవ్వడాన్ని నాయకులు తప్పు పట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ వై.రవికుమార్ కు అందచేశారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి కన్వీనర్ వేంద్ర శ్రీనివాస్, భీమవరం నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాత సురేష్ బాబు, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, పంతం వెంకటసతీష్, దొంగ వెంకటేశ్వరరావు, అంగర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక వాయిదా

విశాలాంధ్ర -ఏలూరు : ఏపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించదలచిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఏపిఇపిడిసిఎల్ ఏలూరు ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టి. శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమం తదుపరి తేదిని తెలియపరచడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా కోరారు.

పార్టీ కార్యాలయాలకు కుర్చీలు అందజేత

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని తొమ్మిది పంచాయతీలలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల నిర్వహణ కోసం ఆ పార్టీ పోలవరం నియోజకవర్గం అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి బుధవారం కుర్చీలు అందజేశారు. ప్రతి పంచాయతీలోని పార్టీ గ్రామ అధ్యక్షులకు ఐదు కుర్చీలు చొప్పున 45 కుర్చీలను నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ద్వారా ఇచ్చారు. అనంతరం కన్నాయిగుట్ట గ్రామంలో జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు దుకాణదారులు, ప్రజల వద్దకు వెళ్లి వైసిపి పాలనలో పెరిగిన ధరలు, పడుతున్న ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజా వ్యతిరేకంగా ముందుకు వెళ్తున్న జగన్ ప్రభుత్వ పాలనపై తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తూ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అమరవరపు అశోక్, ప్రధాన కార్యదర్శి కట్టం రాంబాబు, మాజీ జడ్పీటిసి శాఖమూరి సంజీవులు, కరుటూరి రాధాకృష్ణ, కురిమెళ్ల సుధాకర్, నయిమ్, నఖిం, కుక్కునూరు రాంబాబు, పూనెం రామారావు పార్టీ గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

విశాలాంధ్ర- ముసునూరు: వేసవికాలంలో మంచినీటి కొరత లేకుండా చూడాలనే ఉద్దేశ్యంతో నూతన బోరు వేయించనున్నట్లు వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు.బుధవారం మండలంలోని లోపూడి గ్రామ పంచాయితీ శివారు బస్సావరప్పాడు గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా నూతన బోరు మోటారు ఏర్పాటు చేసి త్రాగు నీటి ఎద్దడి లేకుండా చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్ ,సర్పంచ్ పేరం కృష్ణ ,ఉపసర్పంచ్ ముప్పా బాబురావు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

అభిషేకం

విశాలాంధ్ర - కాకినాడ,తాళ్ళరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం ఇంజరం గ్రామంలో ప్రశిద్ధ శివాలయం శ్రీ ఉమాకృపేశ్వర దేవస్థానంలో కవల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ముమ్మిడివరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దాట్ల సుబ్బరాజు పుట్టినరోజు పురస్కరించుకుని 18 రకాల పండ్ల రసాలతో అభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో దాట్ల సుబ్బరాజు, తెలుగుదేశం పార్టీ తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ధూళిపూడి వెంకటరమణ, వేగేశ్న భాస్కర రాజు, వుంగరాల వెంకటేశ్వరరావు, టేకుమూడి లక్ష్మణరావు, ఆకెళ్ళ నాగేశ్వరావు, కాట్రు వీరేశ్వరరావు, రేలంగి శ్రీకాంత్, భైరవమూర్తి, అప్పారావు, నాని, అంజి, మహేంద్ర, శ్రీనురాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వర నీరాజనానికి ప్రేక్షకుల నీరాజనం

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : స్థానిక విక్రమహాల్‌లో పట్నాల వెంకట సుబ్బమ్మ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ పట్నాల శ్రీనివాస్ సారథ్యంలో యాంకర్,గాయకులు సింగర్ దీపిక అధ్వర్యంలో జరిగిన "మళ్ళీ మళ్ళీ పాడాలి" స్వర నీరాజనం సంగీత విభావరి అలరించింది. ముఖ్య అతిథులుగా హ్యూమన్ రైట్స్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు పట్నాల శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్ ఎ.వి రమణ,వంద పాటలు పాడిన బర్రె సుబ్రమణ్యం పాల్గొన్నారు. గాయకులు పట్నాల శ్రీనివాస్, దీపిక, ఆదర్శ, ఫణి కుమార్, రాధ, సుభాష్ లు ఆణిముత్యాల వంటి పలు పాత,కొత్త పాటలు పాడి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కళాకారులకు ప్రోత్సాహం అందిస్తున్న పట్నాల శ్రీనివాస్ అభినందనీయులని కొనియాడారు. కళాకారులకు దాతల సహకారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్నాల శ్రీనివాస్,దీపిక ఆదర్శ్ దంపతులు,బర్రె సుబ్రమణ్యంలకు ప్రముఖులు చేతుల మీదుగా ఘనంగా సత్కారించారు.అనంతరం లక్కీ డీప్ ద్వారా ప్రేక్షకులకు పలు గిఫ్ట్ లు అందజేశారు. ఈకార్యక్రమంలో గాయకులు ఆదర్శ్, ఫణి కుమార్,ఆనంద్, గంగాధర్, ఈమని శైలజా, హేమాంబిక, రాధ,వీరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గరగనృత్యం కళాకారుడు లోవరాజుకు సన్మానం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండల పరిధిలోని దొంతికుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి మల్లాడి లోవరాజు గరగ నృత్యంలో ప్రతిభ కనపరుస్తున్నాడు. ఈ ఏడాది జనవరి 26 తేది రిపబ్లిక్ దే సందర్భంగా మన దేశరాజధాని న్యూ ఢిల్లీలో ప్రదర్శించిన ఆంధ్రప్రదేశ్ శకటము నందు గరగ నృత్య బృందంలో పాల్గొని తన ప్రతిభ కనబరిచాడు. ప్రతిభ కలిగిన కళాకారుడు మల్లాడి లోవ రాజును పాఠశాల అవరణలో బుధవారం ప్రధానోపాధ్యాయులు వై చంద్ర శేఖర్, స్టాఫ్ సెక్రటరీ బివి లక్ష్మణ్ జీ, ఉపాధ్యాయులు డివి నారాయణ, వేణు గోపాల్, గోపాలకృష్ణ, వర్మ తదితరులు సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన సాయి మాధవి విద్యార్థులు

విశాలాంధ్ర - అనపర్తి : ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక శ్రీ సాయి మాధవి డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారని ప్రిన్సిపల్ ఎస్. నవీన్ తెలిపారు. గురువారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో బి హరిణి 9.5, జి శివ బిందు 9.4, డి సరస్వతి 9.2, ఎల్ సువర్ణ 9.2, సిహెచ్ విజయలక్ష్మి 9.1 పాయింట్లు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా బీఎస్సీ, బికాం విభాగంలో 98.4, 97.8% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ నవీన్ చెప్పారు. ఈ సందర్భంగా ఎం ఎస్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మల్లెడి అనంత సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సెమిస్టర్ లోను శ్రీ సాయి మాధవి కళాశాల విద్యార్థులు సాధించడం పట్ల అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.ఇంకా విద్యార్థులను సత్యభామ స్కూల్ డైరెక్టర్ ఎం మాధవి లత, శ్రీ సాయి మాధవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి రామభద్రారెడ్డి (మల్లంపూడి), ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తాడి సతీష్ రెడ్డి, సత్యభామ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం పైడిరాజు తదితరులు అభినందించారు.

రామన్నపాలెంలో ఇదేం కర్మ

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండలం రామన్నపాలెం గ్రామంలో బుధవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు ఉండవల్లి దుర్గారావు పరిమి శ్రీ రామకృష్ణ దేవరపల్లి మండల టిడిపి అధ్యక్షులు ఆంద్రు అనిల్ కాట్రగడ్డ సోమరాజు, కాట్రగడ్డ రామ్మోహన్ గన్నమని హరికృష్ణ పెన్మెత్స సుబ్బరాజ కొటారు ద్రవ కాంత్ పాతూరి గిరిధర్ బొల్లిన భాస్కర్ యద్దనపూడి బ్రహ్మరాజు పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం

- ఎజెండా ఊసే లేదు...?
- రాసింది ఒకటి చెప్పేది మరొకటి
- విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - చాట్రాయి : చాట్రాయి మండల పరిషత్తునిధులు ఏమవు తున్నాయి అంటూ విశాలాంధ్రలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం వైసీపీ నాయకత్వాన్ని ఓ కుదుపు కుదిపింది. గతంలో చాట్రాయి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు

చాట్రాయి పోలీస్ స్టేషన్లోనే నిరసన తెలియజేసే సందర్భంగా టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత కొడాలి నానిని ఎన్కౌంటర్ చేస్తాం అని ఆగ్రహంతో ఊగిపోతూ పోలీసులముందే ఉపన్యాసాలు చెప్పిన రోజు అదే వీడియో లు సోషల్ మీడియా లో పదే పదే చక్కర్లు కొట్టినా వైసీపీ నాయకత్వం ప్రేక్షకపాత్ర పోషించింది. నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ అనేక సందర్భాలలో ఎంఎల్ ఎ ప్రతాప్ పై వ్యక్తి గతదూషణలకు పాల్పడిన సందర్భంలో నోరుమెదపలేదు. విశాలాంధ్ర కథనంపై ఆఘుమేఘాల మీద ఎంపీటీసిలను ఆగ్రామాల పెత్తందారులను పిలిపించి విలేఖరుల సమావేశం నిర్వహించారు. విశాలాంధ్ర కథనంలో ముఖ్య మైన అంశం ఎజెండా కాపీలను ఇవ్వలేదనే విషయం అనేక మంది కొత్త ఎంపిటిసిలకు అస్సలు ఎజెండా అంటే ఏమిటో కూడా తెలియకపోవడం గమనార్హం. అవినీతి జరిగిందని రాయకపోయినా అవినీతి గురించి రాసారంటూ కట్టుకథ అల్లారు. అవినీతి జరగలేదని కొంతమంది ఎంపీటీసీ లతో చెప్పించుకున్నారు. వాళ్ల పత్రికలలో ప్రచురించుకున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మండల పరిపాలనలో కీలకమైన పాత్ర పోషించే వ్యక్తి ఎజెండా, లెక్కలు గురించి స్వయంగా చెప్పాల్సి ఉన్నప్పటికీ ఆ సమావేశంలో ఆయన లేకుండా సీనియర్ అసిస్టెంట్ తో లెక్కలు చెప్పించారు. వివరాలు అడిగిన విశాలాంధ్రకు నేటికీ ఎంపిడిఓ వివరాలు ఇవ్వనేలేదు. వాళ్ల నిర్వహించిన ఎంపీటీసీల సమావేశంలో కూడా పెత్తందారులదే ప్రధానోపాత్రగా ఉన్నట్టు విశ్వసనీయవర్గాల కథనం. కొంతమంది ఎంపీటీసీలు సమావేశం ఎందుకు పెట్టారో కూడా అర్థం కాక గందరగోళానికి గురైనట్లు తెలిసింది. రాజ్యాంగ బద్ధంగా నిబంధనల ప్రకారం జరగాల్సిన విషయాలుఎలా జరుగుతున్నాయి అని ప్రశ్నించిన విశాలాంధ్ర కు సమాధానమే చెప్పలేదు. కొబ్బరి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డికి అన్నచందంగావుందని పలువురు అంటున్నారు.

బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలను నాశనం చేసిన వైకాపా ప్రభుత్వం

విశాలాంధ్ర - మామిడికుదురు : బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల జీవితాలను వైయస్సార్సీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మామిడికుదురు మండలం తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు చేపట్టిన నిరశన కార్యక్రమంలో ముందుగా స్థానిక సెంటర్‌లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అనంతరం మామిడికుదురు మండల తహశీల్దార్ సీఎచ్ నాగ లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి గొల్లపల్లి, పి గన్నవరం నియోజకవర్గం ఇంఛార్జి గంటి హరీష్ మాధుర్‌లు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ ప్రోత్సాహంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులతో పాటు, కాపు విద్యార్థులను ప్రోత్సహించి విదేశాలకు పంపిస్తే ఈ దుర్మార్గపు వైయాస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశాలలో ఉన్న విద్యార్థులను మోసగించి వారికి ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాలను నిలిపివేసి వారి జీవితాలను సర్వనాశనం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, వర్ధినీడి బాబ్జి, అప్పారి వెంకటేశ్వరరావు, ఉండ్రు శ్రీరామ్మూర్తి, చుట్టుగుళ్ల కిషోర్, మద్దాల నాగబాబు, కొమ్ముల నందు బాబు, యర్రంశెట్టి తాత బుజ్జి, సాపే కాశీ తదితరులు పాల్గొన్నారు.

అడ్డు అదుపు లేని ధరలు

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు నియోజక వర్గం, కొవ్వూరు టౌన్ లో 3వ వార్డులో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి కంటమణి రామకృష్ణ కొవ్వూరు టౌన్ అధ్యక్షులు దాయన రామకృష్ణ, టిడిపి నాయకులు సూరపనేని చిన్ని, క్లస్టర్ ఇంచార్జ్ పినుమాక జయరాజు టిడిపి నాయకులు జి జి చలం వేమగిరి వెంకట్రావు ,కుప్పాక జోహార్ 3 వ వార్డ్ కొల్లి రమేష్, కుక్కిరిపాటి వెంకటేష్, నూతంగి విజయ్ కుమార్, మరియు నాయకులు పాల్గొన్నారు.

జగ్గంపేట జనసేనలో భారీ చేరికలు

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట మండలం సగరపేట గ్రామంలో జనసేన పార్టీ జగ్గంపేట మండల ప్రధాన కార్యదర్శి గండికోట వీరపాండు ఆధ్వర్యంలో పంచాయతీ వార్డు మెంబర్లు గాది పెద్ద అప్పన్న, గాది నాగరాజులతో పాటు సుమారు 100 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర జనసైనికులను, గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు వివరించారు. పవన్ కళ్యాణ్ నీతి, నిజాయితీలతో కూడుకున్న మంచి సామాజిక దృక్పథం ఉన్న వ్యక్తి అన్నారు. ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించారు. నూతనంగా జనసేన పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సగరపేట గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండా స్థూపం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, సగరపేట గ్రామ ప్రజలు, అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

దొంతికుర్రులో ఇదేం ఖర్మ

విశాలాంధ్ర - కాట్రేనికోన : దొంతికుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో మర్లచెరువు, కోతులచెరువు గ్రామాలులో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుతం ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, మండల సీనియర్ నాయకులు పల్లంకుర్రు ఇంచార్జ్ వెంట్రు సుధీర్, జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి విత్తనాల వెంకటరమణ, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు కాశి నరేష్ బాబు, దొంతికుర్రు గ్రామకమిటీ అధ్యక్షులు యనమదల వెంకటరమణ, కడలి వెంకట సత్యనారాయణ, పెనుమల్ల గ్రామకమిటీ అధ్యక్షులు కొండేటి చినబాబు, గంగుమళ్ళ భద్రరావు, కాండ్రేగుల ప్రసాద్, మట్ట రమేష్, ఎలిపే వెంకటేశ్వరరావు, చెల్లి నడవపల్లి, గుబ్బల వెంకటసత్యనారాయణ, బొంతు నాగమునేశ్వరరావు, పెయ్యల రవికుమార్, అయితాబత్తుల బోసు, కాశి ప్రసాద్, కొప్పిశెట్టి రామకృష్ణ, తాడి బుల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.